# తండ్రి తనయుడు +

రచన :
శ్రీ కలగర్ల నరసింహామూర్తి.

క్రార్చిచ్చులాంటి ఈ భయంకరమైన జీవితం నుండి, తప్పించుకొని దూరంగా, ఎంతో దూరంగా పారి పోవాలనిపిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు. కానీ నీడలా వెన్నాడే జీవితం కబంద హస్తాల్లో నుండి, తప్పించు కోవటం, నాలాంటి సామాన్యులకు ఎలా సాధ్యం? ఆ శక్తి ఒక్క మృత్యుదేవతకే ఉంది. కానీ చావును అంత తేలిగ్గా ఆహ్వానించగలమా? చేతులారా ఈ గ్రుక్కెడు ప్రాణాన్ని వదలటం ఎంత కష్టం?

అరవై ఏళ్ళ జగన్నాథం మంచానికి బల్లిలా అంటుకొని, తనలో తానే ఏవిటేవిటో గొణుక్కుంటున్నాడు. దీర్ఘవ్యాధితోనూ, వార్ధక్యంతోనూ అతడు పూర్తిగా చిక్కి శల్యమైపోయాడు. ఈ జగన్నాటకంలో అతని పాత్ర ముగింపుకు వచ్చింది. సర్వేశ్వరుని పిలుపుకోసం, ఆ సామాన్య మానవుడు ఎదురు చూస్తున్నాడు. అప్పుడప్పుడు అతనికి విపరీతమైన దగ్గు వస్తుంది. ఆ దగ్గు భయంకరమైనది. అంత గట్టిగా దగ్గడానికి అతనిలో ఓపిక లేదు, బలమూలేదు. ఆ దగ్గు రాగానే, అతడు శ్లేష్మంలోపడ్డ ఈగలా, గిజగిజా తన్నుకుంటాడు. కానీ ఆ దగ్గుకు, దయా దాక్షిణ్యాలులేవు. అతన్ని చిత్రవధ చేస్తుంది. ఆ బాధ భరించలేక 'చంపేయ్ భగవంతుడా!' అని ఏడుస్తుంటాడు జగన్నాథం.

'మావయ్యా! కాఫీ పుచ్చుకోండి' అన్న కోడలు కమల మాటలువిని, మెల్ళగా కళ్లు తెరిచాడు జగన్నాథం. కమల చెమిచాతో కాఫీ తీసి, మామగారి నోట్లో పోస్తూ ఉంది. మెల్ల మెల్లగా త్రాగుతూ, కాఫీ త్రాగడం పూర్తి చేశాడు జగన్నాథం.

తర్వాత కమల పొడిగుడ్డతో, మామగారి ముఖాన్ని మెల్లగా తుడిచి, కాస్త 'వక్కపొడి వేసుకుంటారా మావయ్యా!' అంది.

'అందుకోతల్లీ'! అన్నాడు జగన్నాథం కొంచం ఆయాసంగా. వక్కపొడి తీసుకురాడానికి లోనికి వెళ్ళింది కమల.

కాఫీ కడుపులో పడగానే, జగన్నాథం ప్రాణం కాస్త తెప్పరిల్లింది. ఇంతలో కోడలు వక్కపొడి తెచ్చి 'నోరు తెరవండి మావయ్యా' అంది. జగన్నాథం నోరు తెరిచాడు. కమల, మామగారి నోట్లో వక్కపొడి వేసింది. మెత్తని ఆ వక్కపొడిని మెల్లగా చప్పరిస్తూ అమ్మడూ! చచ్చి ఏ కడుపున పుట్టి నీ ఋణం తీర్చుకుంటాను తల్లీ! నువ్వు నాకు కోడలవేమాత్రముకాదు. నన్ను నీ కన్నతండ్రిలా కళ్ళల్లో పెట్టుకొని కాపాడుతున్నావ్. ఈ ముసలి ప్రాణం, నిన్ను ఎంతో కష్టపెడుతూ ఉంది తల్లీ!' అన్నాడు జగన్నాథం. అతని కళ్ళు ఆ మాటలతో చెమ్మగిల్లినాయ్!

కమల చప్పున మావగారి రెండు చేతుల్ని పట్టుకొని 'ఎంతమాటన్నారు మావయ్యా? మిమ్మల్ని సేవించటం, నా ధర్మం మావయ్యా! ఆ ధర్మాన్ని విస్మరిస్తే, ఈ దుర్మార్గుల్ని భగవంతుడు క్షమిస్తాడా! మీరు నా సేవతో సంతృప్తిపొంది, నన్ను ఆశీర్వదిస్తే, ఆ ఆశీర్వాదమే, నాకు, నా వృద్ధాప్యంలో శ్రీరామరక్షగా నిలబడుతుంది మావయ్యా! మిమ్మల్ని హింసిస్తే, రేపు ముసలి కాలంలో నా బిడ్డలు నన్నుకూడా హింసిస్తారు! కాబట్టి ఇదంతా నా స్వార్థమే మావయ్యా! కేవలం భవిష్యత్తులో సుఖించడం కొరకే, మిమ్మల్ని సేవిస్తున్నాను.'

అంటూ కమల నవ్వింది. జగన్నాథం మనస్సంతా తృప్తితోనూ, ఆనందంతోనూ నిండిపోయింది. 'నీ మనసు నవనీతం తల్లీ! అన్నట్టు రామం ఇంకా ఆఫీసు నుండి రాలేదమ్మా! ఇంకా ఎప్పుడొస్తాడో యేమో! టైము ఎంత అయిందమ్మా! ఆఫీసు విడిచిపెట్టే వేళ అయింది కదూ!' అంటూ, అన్ని ప్రశ్నలు ఒక్కసారిగానే, వెయ్యసాగాడు జగన్నాథం. అన్నిటికీ తల ఊపి 'ఆ! ఇక వచ్చేస్తారు మావయ్యా! కాస్సేపు మీరు కళ్లు మూసుకొని నిద్రపొండి. విశ్రాంతి చాల అవసరం అని డాక్టరు మరిమరీ చెప్పాడుగా! నిద్రలేచిన తర్వాత మందు పుచ్చుకుందురుగాని!' అంటూ కమల తెల్లని దుప్పటి జగన్నాథం గొంతువరకూ కప్పి, లోపలికి పోయింది.

కళ్లు మూసుకున్నాడేగానీ, జగన్నాథానికి నిద్ర రావటం లేదు. ఇప్పుడు జగన్నాథానికి కొడుకుమీద

మరీ ఆపేక్ష ఎక్కువవుతూ ఉంది. తనకొడుకు ఎప్పుడూ తనదగ్గరే ఉండాలని, పోతే తన జీవం ఆ కళ్ళముందే పోవాలని జగన్నాథం ఏవేవో పిచ్చిగా ఆలోచిస్తున్నాడు. తనేకాదు, లోకంలో ఏ తండ్రైనా, వృద్ధాప్యంలో, తన కొడుకు తనముందే ఉండాలని ఆశిస్తాడు. ఉన్నట్టుండి, జగన్నాథం హృదయం రెక్కలు తెగిన పక్షిలా, విలవిలా కొట్టుకుంది. నలభైఏళ్ళ క్రితంనాటి, తన జీవిత చరిత్రను తరచి చూసుకున్నాడు. గతమంతా, అతని కళ్ళముందు సినీమా రీలులా గిఱ్ఱున తిరిగింది. ఆ చలన చిత్రంలో కథానాయకుడు. తండ్రి హృదయాన్ని చీల్చి చెండాడిన దుర్మార్గుడు.

అప్పటికి జగన్నాథం, ఇరవై రెండేళ్ళ యువకుడు. సృష్టిలోని సౌందర్యమంతా, పంచరంగులు పులుముకొని, మానవుని మనస్సును. ఏవేవో తీయని తలపుల భారంతో కవించే వయస్సది. తండ్రికి ఒక్కడే సంతానం కావటం చేత జగన్నాథం ఎంతో గారాభంగా పెరిగాడు. ఆ గారాభం ఎంత భయంకరమైన పరిణామానికి దారి తీస్తుందో, మొదట్లో జగన్నాథం తండ్రి ఊహించుకోలేకపోయాడు. చదువు సంధ్యలు జగన్నాథానికి జడిసి, ప్రాణ స్నేహితులైనాయ్. చిన్ననాటి కానీ పందాలు, వయస్సు వచ్చిన నాటికి క్లబ్బుల్లో పేకాటగా మారినాయ్. త్రాగుడు జూదం, వ్యభిచారం జగన్నాథానికి ప్రాణస్నేహితులైనాయ్. జగన్నాథం తండ్రి దుఃఖంతో కుమిలిపోయేవాడు. 'కాంతం! ఈ సంతానాన్ని నాకు అప్పజెప్పి, నువ్వు చనిపోయి, ఈ బాధల నుండి శాశ్వతంగా తప్పించుకున్నావ్. వాడు నా కంటిముందే ఇలా సర్వనాశనమైపోతూ ఉంటే, నేను చూడలేను కాంతం! నన్నుకూడా నీ దగ్గరకు తీసుకుపో!' అని భార్యఫోటో ముందు నిలబడి దుఃఖిస్తూ ఉండేవాడు.

'పెళ్లి చెయ్యవయ్యా! పిల్లాడు బాగుపడతాడు' అని ఎవరో సలహా యిచ్చారు జగన్నాథం తండ్రికి. అది నిజమేననిపించింది. వెంటనే ఆ మాటను తన కొడుకు చెవిలో వేసాడు. ఏకళ నున్నాడోగానీ జగన్నాథం సరేనన్నాడు. ముసలి ప్రాణం ఉప్పొంగిపోయింది. కానీ అప్పటికే ముసలివాని ఆస్తిలో చాలాభాగం హరించుకు పోయింది. ఇక ఉన్నదల్లా, తలదాచుకోడానికి ఆ యిల్లు ముక్క, ఏడాదంతా కడుపునిండే పొలం చెక్కాను. ఏదో విధంగా కొడుకు ఒక ఇంటివాడైతే ఆ కాస్తా ఆస్తినైనా కాపాడుకుంటాడని ముసలివాని ఆశ.

కానీ ఆ ఆశలనన్నీ నాశనం చేసినందుకు ఈ నాడు రోగిష్టి జగన్నాథం పశ్చాత్తాపంతో కుమిలి పోయాడు. బైట ఆకాశంలో మేఘాలు నల్లగా దట్టంగా అలుముకున్నాయ్. కొద్ది సేపట్లో చిన్న తుంపర్లుపడి, వాన పెద్దదయింది, రోడ్డుమీద జనసంచారం తగ్గిపోయింది. చీకటి మెల్ల మెల్లగా అలుముకుంటూ ఉంది. టంగు టంగున గడియారం ఆరుగంటలు కొట్టింది జగన్నాథం ఆతృత హెచ్చింది.. కొడుకు ఇంకా యింటికి రాలేదు. ఎందుకో ఈ రోజు మనస్సంతా అదోలా ఉంది, గుండెల్లో భయం గునపాలతో జడుస్తూ ఉంది. అశాశ్వితమయిన తన జీవితానికి భగవంతుడు నేటితో భరతవాక్యం పాడతాడనే పిచ్చి ఆలోచన మనస్సులోకి రాగానే, జగన్నాథం బెంగతోనూ భయంతోనూ గజగజలాడిపోయాడు. మెల్లగా గొంతెత్తి 'అమ్మడూ! కమలా!' అంటూ కోడల్ని పిలిచాడు. ఆ పిలుపు విని కమల లోపలినుండి పరుగెత్తుకొంటూ వచ్చి 'ఏం మావయ్యా! పిలిచారా!' అంది. జీవంలేని జగన్నాథం కండ్లలో భయం మాత్రం స్పష్టంగా కనిపిస్తూ ఉంది, కమల మనసు కరిగిపోయింది. ఆ ముసలి హృదయం ఎందుకో వాపోతూ ఉందని ఆమె గ్రహించింది. ప్రేమతో 'ఏం మావయ్యా! ఏమిటి కావాలి' అంది.

జగన్నాథం వణికిపోతూ 'అమ్మా ఎందుకో భయంగా ఉందమ్మా! అబ్బాయి యింకా రాలేదుకదూ! నేను యివాళ చచ్చిపోతానమ్మా! నా రాముణ్ని ఇంకోసారి ఈ పాపిష్టి కళ్ళతో చూడకుండానే చచ్చిపోతానేమో?' అంటూ భోరున పసిపిల్లాడికి మల్లే ఏడ్చాడు.

కమల, జగన్నాథం కన్నీళ్లు తుడుస్తూ 'తప్పు మావయ్యా! మీరు అనవసరంగా కంగారు పడకండి. వారు ఈ పాటికి యింటికి రావలసిందే! వర్షం మూలాన ఎక్కడో నిలబడి ఉండిపోయి ఉంటారు. మీకేం భయం లేదు మామయ్యా! కాస్సేపు కళ్ళు మూసుకొని నిద్రపొండి!' అంటూ కమల గ్లాసులో మందు కలిపి 'ఈ మందు త్రాగండి మామయ్యా!' అంటూ జగన్నాథం చేత మందు త్రాగించి, లోనికి వెళ్ళిపోయింది.

మా హృదయపూర్వకమైన దీపావళి అభినంధనలు

మీకు కావలసిన....

# మా 1962

మల్టీకలర్ హాఫ్‌సెట్ పిక్చర్ కాలండర్లకు, ఆర్డరులు, దయచేసి మా ఏజంట్లద్వారాగాని, లేక మాకు నేరుగాగాని పంపించవలెనని కోరుచున్నాము.

## ది కారనేషన్ లిథో వర్క్స్,

దర్మవిల్లా బిల్డింగ్స్:—త. పె. నెం. 2 — శివకాశి (S.I.)

ఫోన్. నెం. 54 — స్థాపితం 1936 — గ్రామ్స్: "కారనేషన్."

జగన్నాథానికి తన గత చరిత్ర తిరిగి కళ్ళముందు మెదిలింది.

జగన్నాథం ముసలి తండ్రి ఎంతో కష్టపడి, ఒక కుగ్రామంలోని కన్యను తెచ్చి జగన్నాథం పెళ్ళి జరిపించాడు. అదీ చాలా రహస్యంగా, అకస్మాత్తుగా జరిగింది. కారణం జగన్నాథం గుణగణాలే. అతని దుష్ప్రవర్తన చుట్టుప్రక్కల గ్రామాలకు కూడా వ్యాపించింది. అందువల్ల తెలిసిన వారెవ్వరూ, జగన్నాథానికి సిల్లనివ్వడానికి సమ్మతించేలేదు. పైగా జగన్నాథానికి పిల్లనిచ్చే పొరపాటు, ఎవరయినా తెలియక చేయబోతే సాధ్యమైనంత వేగంగా ఆ కన్యాదాత చెవిలో జనన్నాథం సుగుణాల్ని వర్ణించి ఆ సంబంధం తప్పిపోయేటట్టు చేసేవారు.

జగన్నాథం భార్య పేరు భాందవి. ఆ అమ్మాయిది చాలా లేమి కుటుంబం. చిన్ననాడే తల్లిదండ్రిని పోగొట్టుకున్న ఆ అనాథ, పేద మేనమామ ఆదరణలో పెరిగింది. మేనమామ భార్య చాలా కఠిన స్వభావం కలది. ఆవిడకు తన యిద్దరి స్వంత బిడ్డలతోపాటూ భాందవిని కూడా సమానంగా ఆదరించడం చేతగాని పని అయింది. అందువల్ల ఆవిడ చాలా తెలివితేటలతో ప్రవర్తించేది. సాధ్యమైనంత తక్కువ తిండి పెట్టి ఆ తిండికి ఇరవై ఇంతలు చాకిరి చేయించి, భాందవి రక్తమాంసాన్ని పూర్తిగా పీల్చి పిప్పి చేసి మరీ వదలి పెట్టింది. భాందవికి జరుగుతున్న అన్యాయం మేనమామకు బాగా తెలుసు. కానీ భార్యనోరు తెలిసినవాడు కావటంచేత కిక్కురుమనకుండా చాటుగా కంట తడి పెట్టుకునేవాడు. అప్పుడప్పుడు 'నేను ఉండి కూడా, చచ్చినవాడితో సమానమమ్మా! నిన్ను సుఖ పెట్టలేక పోతున్నాను' అంటూ చాటున భాందవిదగ్గర బాధపడేవాడు. భాందవి నిర్విచారంగా చిరునవ్వు నవ్వి ఊరుకునేది. ఆమె సహనాన్ని, శాంతాన్ని ఎవ్వడూ కోల్పోలేదు. పేదవాడయిన మేనమామ, పెద్ద కట్న కానుకలు యివ్వటానికి శక్తిలేక, జగన్నాథానికి తన మేనకోడల్ని ఇవ్వటానికి అంగీకరించాడు.

పెళ్ళి పూర్తి అయింది. ఇప్పటికిగానీ, ఆ అమాయకానికి తెలిసిరాలేదు జగన్నాథం భ్రష్టుడని, తెలిసిన తర్వాత నెత్తి, నోరు కొట్టుకుని భాందవిని కావలించుకొని 'నీ బ్రతుకు బండలు చేసానే తల్లీ అని భోరున ఏడ్చాడు. భాందవి చలించలేదు. కష్టాలలో పుట్టి కష్టాల్లో పెరిగి, తిరిగి కష్టాల్లోనే పడుతున్న భాందవికి, బాధలంటే బొత్తిగా భయం లేకపోయింది. ఫేలవంగా నవ్వి 'ఇంధులో నువ్వు చేసిన అన్యాయం యేమీ లేదు మామయ్యా! నా తలవ్రాత ఎలా ఉంటే అలా జరుగుతుంది. దుఃఖ పడకు మావయ్యా! ఊరుకో' అంటూ భాందవి మేనమామను ఓదార్చింది.

భాందవిలాంటి ఉత్తమరాలు, తన కోడలైనందుకు, జగన్నాథం తండ్రి ఆనందంతో పొంగిపోయాడు' సౌందర్యవతి, సుగుణవతియయిన కోడలు రాకతోనైనా తన కొడుకు బుద్ధి తెచ్చుకుంటాడని ఆ ముసలివాడు ఆశించాడు, కానీ అతని ఆశలన్నీ నిరాశలయినాయ్. కొడుకు ప్రవర్తనలో కొంచెంకూడా మార్పు కనిపించలేదు. మొదట్లో జగన్నాథం వారానికి నాలుగు రోజులయినా ఇంట్లో ఉండేవాడు. కానీ భార్య నెల తప్పిందన్న వార్త అతని చెవులకు ములుకుల్లా సోకింది. జగన్నాథం తండ్రి ఆనందంతో పొంగిపోయాడు.

ఉన్నట్టుండి. ఒక శుభోదయాన్న. జగన్నాథం, మేరీ అనే కిరస్తానీపిల్లతో పరారైనాడు. పారిపోతూ, భార్య నగల్ని, ఇంట్లోఉన్న డబ్బు దస్కాన్ని తస్కరించి మరీ మాయమయ్యాడు జకన్నాథం. కులగౌరవం. సిరిసంపదా అన్నీ మాయమైపోవటంతో, జగన్నాథం తండ్రి నిలువునా కూలిపోయాడు, మనోవ్యాధితో మంచంపట్టి, కొడుకుకోసం కలవరించసాగాడు. బాంధవికి, బాధలను సహించగల శక్తి నానాటికీ, నశిస్తూ ఉంది. కట్టుకున్న భర్త కంటికి కనిపించకుండా పరారయ్యాడు. కన్నతండ్రిలా ఆదరిస్తున్న మావగారు మంచం పట్టారు, చింతలతో. చికాకులతో పూర్తిగా చితికిపోయి, అప్పుడప్పుడు ఏ నూతిలో గోతిలోనోపడి, ఆ గ్రుక్కెడు ప్రాణాన్ని పోగొట్టుకోవాలనుకునేది బాంధవి. కానీ కడుపులో పెరుగుతున్న బిడ్డ, కళ్ళఎదుట మంచంమీద నానాటికీ కుష్కించిపోతున్న మావగారు, ఆవిడ కళ్ళముందు మెదిలి, ఆ ప్రయత్నముండి విరమింపచేసేవారు. ఎప్పటికైనా జగన్నాథం తిరిగివస్తాడని బాందవి వెయ్యికళ్ళతో ఎదురుచూసేది.

కానీ ఆవిడ ఆశలు అణగారిపోయినాయ్. జగన్నాథం తిరిగిరాలేదు, జగన్నాథం తండ్రిరోగం నానాటికీ ముదిరిపోతూ ఉంది. ఎన్నిమందు లిచ్చినా, రోగం తగ్గుముఖం పట్టలేదు. కానీ ఇంటిమీద పొలంమీద అప్పు మాత్రం బాగా పెరిగిపోతూఉంది. 'నాయినా! జగన్నాథం జగన్నాథం!' అంటూ ముసలితండ్రి, తన ఒక్కగా నొక్క బిడ్డకోసం, అహోరాత్రాలూ తపించిపోతున్నాడు. ఆ ముసలిప్రాణం, కొడుకు దర్శనంకోసం తహతహలాడిపోతూ ఉంది. కానీ, ఎక్కడో మోహాంధకారంలో మునిగిపోయిన ఆ కొడుక్కిమాత్రం కన్నతండ్రి ఆక్రందన వినిపించలేదు.

జగన్నాథం తండ్రికి మృత్యుగడియలు సమీపించాయ్ అతని నోరు పడిపోయింది. కానీ కొడుకు తిరిగి వస్తాడేమోనన్న ఆశతో గుమ్మంవైపు చూస్తున్నాడు. అమావాస్య అర్ధరాత్రివేళ అతనికి చావుతెలివి వచ్చింది. కోడల్ని పిలిచి దగ్గర కూర్చోమన్నాడు. భాంధవి కళ్ళు దుఃఖంతో ఎర్రబారినాయ్. మావగార్ని మాసి బావురుమని ఏడ్చింది; జీవనయాత్రను ముగించిపోతున్న ఆ ముసలివాడు, కోడలికడుపు తడిమి కళ్ళనీళ్ళు పెట్టుకొని, తిరిగి గుమ్మంవైపు చూసాడు. అనుక్షణం, కొడుకు వస్తాడనే ఆశతో ఆ ప్రాణి గిజగిజ తన్నుకుంటూ ఉంది.' అబ్బాయి ఇక రాడుకదూ!' అన్నట్టు ఆ ముసలివాడుకోడలి వంక చూసాడు. బాంధవి దుఃఖభారంతో తడబడుతూ వస్తారు మావయ్యా! తప్పకుండా వస్తారు అంది కాని ముసలిప్రాణి ఆ మాటల్ని నమ్మేస్థితిలో లేదు. అలా ప్రశాంతంగా కోడలివంకనే చూస్తూ, జగన్నాథం తండ్రి టక్కున మెడవాల్చి, ఇహలోకబంధాల్ని పూర్తిగా తెంచుకొని పరలోకానికి పారిపోయాడు.

మావగారు చనిపోయిన మూడవనాడే భాంధవి ప్రసవించింది మగబిడ్డను కన్నది. ఆనాడే జగన్నాథం తిరిగి ఇంట్లో అడుగుపెట్టాడు. కానీ చాందవి బ్రతకటం కష్టమని డాక్టరు నిరాశతో అన్నాడు జగన్నాథం ఆత్రతతో భాందవి గదిలోనికి పరుగుతీసాడు. కానీ అప్పటికి భాందవి ఈ లోకంలోనుండి అస్తమించింది. కానీ ఆనాడే జన్మించిన పసివాడు మాత్రం. ఈ లోకంలోని

ఎవరైనా మీవద్ద
తను మాత్రమే మంచి బనియన్
తొడిగినట్లు చెప్పుకొని గర్వపడుచున్న,
మీరు వెనువెంటనే మీశాంతం వదులుకోవద్దు.
వారు ధరించిన బనీనుయందు,
"ఉషా" అని గుర్తున్నదేమో గమనించండి.
ఉన్నట్లైతే మన్నించమనండి.
ఎందువల్లననగా,
"ఉషా" అని గుర్తువేసి ఉండే బనియన్లు
చాలా మేలైనవి. వీటిని

USHA KNITTING COMPANY
TRADE MARK
USHA
BANIANS
TIRUPUR

ఉషా

నిట్టింగు కంపెని తిరుపూరు
వారిచే సరియైన పద్ధతిలో
మంచి నూలుచే తయారు
చేయబడినవి

* ఇప్పుడు ధారాళముగా దొరుకుచున్నది. *

మానవుల కష్టసుఖాలతో, తనకు నిమిత్తం లేనట్టు, ఉయ్యాలతో చక్కగా ఆడుకుంటున్నాడు. జీవితంలో మొదటిసారిగా జగన్నాథం కళ్లు తెరిచాడు. దుఃఖాన్ని ఆపుకోలేక 'భాంధవీ' అని బిగ్గరగా అరిచి, ఉయ్యాల లోని బిడ్డనుతీసి, తన హృదయానికి హత్తుకొని, ఏరులా కన్నీరు కార్చాడు. నాటితో పూర్తిగా మారిపోయాడు. దుర్వ్యసనాలను దూరం చేసాడు. కష్టపడి కొడుకును పెద్దవాణ్ణిచేసాడు. విద్యాబుద్ధులు చెప్పించి, మంచి ఉద్యోగాన్ని ఇప్పించాడు. వివాహం కూడా చేసాడు. కొడుకు, కోడలు సన్మార్గులు. ఉత్తములు జగన్నాథాన్ని కొడుకు కోడలు నెత్తినపెట్టుకొని పూజచేస్తున్నారు.

'నాన్నా' అన్న పిలుపుతో జగన్నాథం మెల్లగా కళ్ళు తెరచి చూసాడు. ఎదురుగా నవ్వుముఖంతో రామం నిలబడిఉన్నాడు. అతని ప్రక్కనే ఉన్న కమల 'మావయ్యా! ఇదుగో మీ అబ్బాయి పిలుస్తున్నారు' అంది. జగన్నాథం వణకుతున్న చేతుల్ని రామం చెంపల మీదకు పోనిచ్చి కూర్చోఅన్నాడు. రామం కూర్చు న్నాడు. జగన్నాథం కదిలి మెల్లగా తనతలను, రామం ఒడిలోఉంచి 'బాబూ! వచ్చేవా నాన్నా! నువ్వు రావేమో నని, నా మనస్సు తపించిపోయిందమ్మా! ఆ ముసలి నాన్నను వదలి ఎక్కడికి వెళ్ళకేం. నువ్వు మానాన్నవి నాన్నా! నిన్ను అప్పుడు హింసించానని నన్నిప్పుడు హింసించకు నాన్నా! నన్ను క్షమించవూ! నిన్ను చూడ టానికి రాలేదని' నామీద కోపంగా ఉందికదూ! నేను దుర్మార్గున్నికదూ.'

జగన్నాథంలో సంధి ప్రవేశించింది రామం కమల కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ, జగన్నాథం జీవిత చరిత్ర ముగిసిపోయింది. అతడు, తన తనయుని ఒడిలోనే శాశ్వ తంగా నిద్రపోయాడు. అన్ని బంధాలను తప్పించుకొని జగన్నాథం అస్తమించాడు.

'నాన్న వెళ్ళిపోయాడు కమలా! తిరిగి మనింటికి ఇంకెప్పుడూ రాడు. నన్ను బాబూ అని ప్రేమతో, ఇక ఎవరు పిలుస్తారు కమలా!' అంటూ తండ్రి శవంమీదపడి భోరున ఏడ్చాడు రామం. కమల స్థాణువులా నిలబడి పోయింది.